అమరజీవి పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి


నందిగామలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు


పేటలో నివాళులర్పిస్తున్న ఆర్.రాఘవేంద్ర, వెంకటకృష్ణప్రసాద్, నాయకులు


పెనుగంచిప్రోలులో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ, అధికారులు


గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న అల్లూరు రామచంద్రుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

నందిగామ టౌన్: బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు కొనియాడారు. ఆయన సేవలను మరువలేనివని, అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన గొప్ప త్యాగశీలి అని కొనియాడారు. నవంబరు ఒకటో తేదీనే ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటుండటం అభినందనీయమన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు అందించిన స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలు, కుల, మతాలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. నేటి యువత పొట్టి శ్రీరాములను ఆదర్శంగా తీసుకొని పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు గుడివాడ సాంబశివరావు, నల్లమల్లి మురళి, విశ్వనాథపల్లి కృష్ణారావు, మన్నెం దాసు, షేక్ యాకుబ్ అలీ, అనుమోలు సారధి, రాచూరి సీతారామ్, దొంతిమాల చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్ : తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ఆత్మ బలిదానానికి వెనుకాడని గొప్పవ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ కొనియాడారు. రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగాన్ని ప్రతిఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా బుధవారం జమ్మి చెట్టు సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నేత సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ పలువురు పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019 నుంచి నవంబర్ ఒకటోతేదీనే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి నాగబ్రహ్మం, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మెపల్లి నరేంద్ర, పార్టీ ఎస్టీ, వాణిజ్య విభాగాల అధ్యక్షులు బద్దూనాయక్, చారుగుండ్ల కొండ, నాయకులు కొత్తా పురుషోత్తం, కర్ల కొండ, దువ్వల రామకృష్ణ, తాళ్లూరి వెంకటేశ్వర్లు, వేముల విజయ్, చిరంజీవి, పెద్దసంఖ్యలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామ: ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలను డివిజన్‌వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించరు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గాంధీ సెంటరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాల పాటి కృష్ణ (కిరణ్), కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాన్ని మరువకూడదని ఎంపీపీ మార్కపూడి గాంధీ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నివాళులర్పించివారిలో మండల పరిషత్ కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు భానుప్రసాద్, సాయి, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని కొణకంచి గ్రామంలోని శ్రీబాలభక్త గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, పాఠశాల హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి కలసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు తన ప్రాణత్యాగం చేసిన వ్యక్తిని స్మరించుకోవడం కూడా గత ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. భవిష్యత్తు తరాలకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం గురించి వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్.నాగరాజు, ఎవో బి.రాజు, సర్పంచ్ కొట్టె నగేష్, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఈవోపీఆర్డీ మాధవి పాల్గొన్నారు.

చిల్లకల్లులో...

చిల్లకల్లు(జగ్గయ్యపేట): రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీవో రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. గండ్రాయి మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు జ్యోతికుమారి, సుబ్బారావు, దైవాదీనం, ముక్తేశ్వరరావు, పూలమాలలువేసి నివాళులర్పించారు.

అమరజీవి గొప్ప మానవతావాది..

జుజ్జూరు(వీరులపాడు): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైందని వీరులపాడు ఎంపీపీ కోటేరు శ్రీలక్ష్మి కొనియాడారు. మండలంలోని జుజ్జూరులో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన అమరజీవిని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, ఆర్యవైశ్య నాయకులు పమిడిమర్రి జగన్‌మోహన్‌రావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వత్సవాయిలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ దేవమణి, అధికారులు


జుజ్జూరులో నివాళులర్పిస్తున్న ఎంపీపీ కె.శ్రీలక్ష్మి, షెహనాజ్‌బేగం, రమావత్ కోటి తదితరులు


నందిగామలో నివాళులర్పిస్తున్న కమిషనర్ డాక్టర్ జయరాం, మున్సిపల్ సిబ్బంది


చిల్లకల్లులో అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రమేష్‌బాబు, అధికారులు

క్లుప్తంగా

ఆర్డీవో సాయిబాబు బాధ్యతల స్వీకరణ



నందిగామ: నందిగామ ఆర్డీవోగా నియమితులైన పి.సాయిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎ.రవీంద్రరావు గుంటూరు జిల్లాకు బదిలీకాగా, ఆయనస్థానంలో సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.సాయిబాబు నందిగామ ఆర్డీవోగా నియమితులయ్యారు. ఈమేరకు నూతన ఆర్డీవో బాధ్యతలు చేపట్టారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలువురు రెవెన్యూ అధికారులు ఆర్డీవో సాయిబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బీమా నగదు అందజేత



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం సూచించారు. గ్రామానికి చెందిన గుంజి వీరాస్వామి అనారోగ్యంతో మృతి చెందగా, వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణం మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10వేలను బుధవారం ఆయన వీరాస్వామి కుటుంబసభ్యులకు అందజేశారు. వైఎస్సార్ బీమా కింద మిగిలిన నగదను త్వరలోనే బాధితకుటుంబానికి అందజేస్తామని జ్యోతిబ్రహ్మం చెప్పారు. మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభచూపిన ముండ్లపాడు విద్యార్థి



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో స్థానిక ముండ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న చెరుకూరి హరికృష్ణ రాష్ట్రస్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఆడే జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థి హరికృష్ణను ప్రధానోపాధ్యాయుడు వేల్పుల సుందరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వలంటీర్‌కు నియామకపత్రం అందజేత



చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామ వలంటీర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన షేక్ బాజీ బాబు స్థానంలో ఆయన భార్య ఖాజాబిని వలంటీర్‌గా నియమించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేష్‌బాబు బుధవారం ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని షేర్‌మహ్మద్‌పేట వలంటీర్‌గా పనిచేస్తూ మృతిచెందిన బాజీబాబు కుటుంబాన్ని ఆదుకునేందుకు మేరకు నియామకం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సాంబశివరావు, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విధులను అడ్డుకున్న వారిపై కేసు నమోదు

ముసునూరు: పోలీసుల కళ్లుగప్పి కోళ్ల వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తూ, వాహనాన్ని పట్టుకోబోయిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఏలూరు ప్రాంతంలోని చేపల చెరువులకు మండలంలోని కాట్రేనిపాడు మీదుగా వెళుతున్న కోళ్ల వ్యర్థాల వాహనాన్ని మంగళవారం అర్ధరాత్రి వాహన తనిఖీల్లో భాగంగా తుక్కులూరు సెంటర్‌లో నూజివీడు ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి ఆపబోగా, పోలీసులను చూసి డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడుపుతూ వెళ్లాడు. పోలీసులు అనుమానంతో వాహనాన్ని వెంబడించగా, అర కిలోమీటర్ దూరం వెళ్లిన తరువాత కాట్రేనిపాడు శివార్లలో పోలీసుల వాహనానికి వారికే చెందిన ఒక కారును అడ్డం పెట్టారు. దీంతో కోళ్ల వ్యర్థలు నింపి ఉన్న వ్యాన్ వెళ్లి పోయింది. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకునేలోపు అతను కూడా కారు వదిలి పారిపోయాడు. ట్రాఫిక్ ఎస్సై బుధవారం ఇచ్చిన ఫిర్యాదుతో కారులో ఉన్న మహిళ, డ్రైవర్లు ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి


కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న వెంకటకృష్ణప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: ప్రజాప్రయోజనాలు, సంక్షేమమే లక్ష్యంగా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ సూచించారు. పట్టణంలోని 15వ సచివాలయం తొర్రగుంటపాలెంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం అందుతున్న విషయాన్ని అందరూ గర్తించాలన్నారు. రాష్ట్రంలో 87శాతం పైగా గృహాలకు ప్రభుత్వం నుంచి ఏదో ఒక రూపంలో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. తొర్రగుంటపాలెంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. చేసిన అభివృద్ధిని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికి తెలియజేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానును గెలిపించుకుంటామని చెప్పారు.

కళ్లజోళ్ల పంపిణీ..

అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి రోగులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్లజోళ్లను సామినేని వెంకటకృష్ణప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మెపల్లి నరేంద్ర, సచివాలయ కన్వీనర్లు పూసల పుల్లారావు, కాసర్ల బాలస్వామి, ధరావత్ శ్యామల, వార్డు నాయకులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు ఎంపిక



జగ్గయ్యపేట అర్బన్: జాతీయ స్కూల్ గేమ్స్‌లో పాల్గొనే రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్టుకు స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్.నటరాజ్ ఎంపికయ్యారు. జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన నటరాజ్‌ను కళాశాల కరస్పాండెంట్ బుస్సా సరిత, కోచ్ కె.గోపి, పీఈటి ఎస్.నాయక్ బుధవారం అభినందించారు. ఈనెల 9వతేదీ నుంచి వైజాగ్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన క్రీడాసామగ్రితోపాటు రైలు టికెట్లను కళాశాల తరఫున అందజేసినట్లు కరస్పాండెంట్ తెలిపారు.

టెక్నాలజీలో మార్పులు గమనించాలి

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికపుడు తెలుసుకుని తదనుగుణంగా నైపుణ్యాలు అలవరచుకోవాలని కెరీర్ గైడెన్స్ నిపుణులు కే తేజోవంత్ సూచించారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు బుధవారం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కెరీర్ గైడెన్స్ నిపుణుడు అమరనాథ్, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు


ఇందిరాకాలనీలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల : గ్రామీణప్రాంతాల్లో మౌలికవసతులు కల్పించేందుకు అవసరమైన నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేస్తోందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. కంచికచర్ల ఇందిరాకాలనీ, నవభారత్‌రోడ్డు నగర్ కాలనీల్లో రూ.65లక్షలతో నిర్మించిన సిమెంటురోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. తొలుత కాలనీలోని ఏకలవ్యుడు, వడ్డే ఏబన్నల విగ్రహాలకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో మౌలికవసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని వివరించారు. మండల పరిషత్, ఇతర నిధులు రూ.65లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టారన్నారు. కంచికచర్లలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించామని, ఆయా ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అన్ని ఏరియాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వసంతకాలనీ, ఇందిరాకాలనీ, మోడల్‌కాలనీలో ఇళ్లపై వేలాడుతున్న 33కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగల కారణంగా ఇబ్బందులుపడుతున్న వైనాన్ని ప్రజలు తనదృష్టికి తీసుకురాగా, సమస్యను వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించినట్లు గుర్తుచేశారు. అభివృద్ధికి మారుపేరు తమ ప్రభుత్వమని పేర్కొన్నారు. గ్రామాల్లో ఏదేని సమస్య ఉన్నట్లయితే తమకు తెలియజేస్తే ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కారక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు నన్నపనేని నరసింహారావు,వేమాసురేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, నాయకులు కావాటి రాంబాబు, ఆదినారాయణ, ఒంటిపులి ప్రసాద్, దేవరకొండ గురవయ్య, తోట బేబి, నారిశెట్టి శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు, ప్రసాద్, మార్త శ్రీనివాసరావు, ఏఈ టీవీ రవికుమార్, కార్యదర్శి మీర్జావలి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ


పేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఖాదర్‌బాబు


విజయవాడలో ముత్తయ్యకు పింఛన్ అందిస్తున్న అనిగండ్లపాడు వలంటీర్ త్రిదిక

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జోరుగా సాగింది. వేకువ జాము నుంచే వైఎస్సార్ పింఛను కానుక పథకం కింద లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేసే కార్యక్రమాన్ని వార్డు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు చేపట్టారు. పింఛన్‌దారులచే ఐరీష్ నమోదు, బయోమెట్రిక్ వేలిముద్రలు వేయించుకుని పింఛన్ నగదు అందజేశారు. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలోని 31వార్డులకు గాను మొత్తం 4,988 మంది పింఛన్‌దారులు ఉండగా, తొలిరోజున 67.47శాతం మందికి రూ.93, 97, 500 పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు తెలిపారు.

జగ్గయ్యపేట మండలంలో...

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని 21 సచివాలయాల పరిధిలో బుధవారం అన్ని రకాల పింఛన్లను వలంటీర్‌లు 70 శాతం మేర పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. అన్ని గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఆయా లబింధదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారని చెప్పారు. పింఛన్‌ల పంపిణీని పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించారు.

60శాతం మందికి పింఛన్లు పంపిణీ

పెనుగంచిప్రోలు: మండలంలో పింఛన్ల పంపిణీ తొలిరోజైన బుధవారం 60 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్‌ను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు వివరించారు. అనిగండ్లపాడుకు చెందిన వలంటీర్ దోసపాటి త్రిదిక విజయవాడ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని చికిత్సపొందుతున్న కుక్కల ముత్తయ్యకు తనతండ్రితో పాటు వెళ్లి పింఛన్ పంపిణీ చేసింది. త్రిదికకు పింఛన్‌దారుడు ముత్తయ్య కృతజ్ఞతలు తెలియజేయగా, లబ్ధిదారులు సుదూరంలో ఉన్నా వెళ్లి పింఛన్ ఇవ్వడంపై గ్రామస్తులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

డిసెంబర్ చివరి నాటికి టిడ్కో ఇళ్ల పంపిణీ


టిడ్కో గృహాల వద్ద పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, సామినేని వెంకటకృష్ణప్రసాద్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన టిడ్కో ఇళ్లను డిసెంబర్ చివరి నాటికి పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో తుదిదశకు చేరుకున్న టిడ్కో ఇళ్ల పనులను బుధవారం వారు టిడ్కో అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికల ముందు అరకొర ఏర్పాట్లతో టిడ్కో గృహాల నిర్మాణాలను చేపట్టిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను నిర్మించడానికి సేకరించిన భూ యజమానులకు, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ వారికి డబ్బులు ఇవ్వకలేదని గుర్తుచేశారు. ఆ బకాయిలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెల్లించినట్లు చెప్పారు. టిడ్కో ఇళ్ల పంపిణీ జాప్యానికి గత ప్రభుత్వ అసమర్థత కారణమన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. అన్నిరకాల మౌలికవసతులు కల్పించి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, సచివాలయ కన్వీనర్ చిరంజీవి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

కంచికచర్ల : మద్యం దుకాణాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయాలు సాగాలని అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏలూరు ఎక్సైజ్ విజిలెన్స్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని పరిటాలతో పాటు ఆయా గ్రామాల్లోని మద్యం దుకాణాలను రెండు రోజులుగా విస్తృతంగా తనిఖీ చేసినట్లు బుధవారం ఆయన తెలిపారు. మండలంలోని పరిటాల మద్యం దుకాణంలో ఎం.కిరణ్‌కుమార్ అనే సూపర్‌వైజర్ ఓ క్వార్టర్‌బాటిల్‌పై అదనంగా రూ.10 వసూలు చేస్తుండగా, నిఘావేసి పట్టుకున్నట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తే ఉద్యోగం నుంచి తొలగించడమే కాకుండా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ హరికృష్ణకుమార్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ప్రాజెక్ట్‌గా ఎస్‌ఎల్‌ఆర్‌ఎం ప్రకటన

జూపూడి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ఘన ద్రవ వ్యర్థాల నిర్వాహణ సంస్థ ఆధ్వర్యంలో జూపూడిలో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్‌ఎల్‌ఆర్‌ఎం (సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్) ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రాజెక్ట్‌గా ప్రకటిస్తారని గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డవలప్‌మెంట్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ ఎస్ఆర్ సంపత్‌కుమార్ గురువారం జూపూడి సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ దేవమాత అధ్యక్షతన జరిగే సమావేశంలో జూపూడి మోడల్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర మోడల్ ప్రాజెక్ట్‌గా ప్రకటిస్తారని పేర్కొన్నారు.


జూపూడిలో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్ట్